# తియ్యని జ్ఞాపకం

## ఎం.వి.ఎస్.ఎస్. ప్రసాద్


**నా**కు ఆ రోజు ఉదయం నుంచి కంగారుగా ఉంది. నేను జీవితంలో ప్రతి చిన్న విషయానికి కంగారుపడుతూనే ఉంటాను. కాని నా ప్రస్తుత కంగారుకి పెద్ద కారణమే ఉంది. చిన్నప్పుడు మా అమ్మగారు "నీకు అన్నింటికి కంగారేరా పిచ్చి సన్నాసి" అనేవారు. అది నూటికి నూరుపాళ్ళు నిజం.

మా మేనేజింగ్ డైరెక్టర్ గారి భార్య మా ఇంటికి వస్తానని కబురు పంపించారు. ఆవిడ వస్తానంటే గట్టిగా రమ్మని చెప్పడానికి సందేహించాను. కానీ వద్దు అని అనలేకపోయాను. నేను ఆవిడ భర్త కంపెనీలో ఒక చిరు గుమస్తాని. నా శ్రీమతి ఏదో ప్రైవేట్ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. ఏదో వేన్నీళ్ళకు చన్నీళ్ళుగా ఆమె జీవితం ఉపయోగపడుతోంది. గుట్టుగా కాపురం చేసుకుంటూ, ఏ హంగులకూ ఆర్భాటాలకు పోకుండా కాలక్షేపం చేస్తూంటే వచ్చిన నాలుగు రాళ్ళు సరిపోతున్నాయి. స్టేటస్ సింబల్ అని కాకపోయినా ఎప్పుడన్నా కాలక్షేపానికి ఉపయోగపడుతుందని వాయిదా పద్ధతిపై టీ.వి కొన్నాం. మేడం వస్తే కనీసం కూర్చోబెట్టడానికి ఒక సోఫా అయినా లేదు. ఏవో చెక్క కుర్చీలు, ప్లాస్టిక్ కుర్చీలతో కాలక్షేపం చేస్తున్నాం. మా ఇంటికి వచ్చే అతిధులు, అభ్యాగతులు తక్కువ కావడం చేత పెద్దగా ఇబ్బంది అనిపించడంలా. కానీ.... కానీ ఈ రోజు స్వయానా మా మేనేజింగ్ డైరెక్టరుగారి సతీమణి మా ఇంటికి వస్తూంటే ఎక్కడ కూచోపెట్టాలో, ఏం చేయాలో తోచడం లేదు. పోనీ ఎక్కడ నుంచన్నా ఏ సోఫా అన్నా తెచ్చి వేద్దామన్నా ఇంటిలో ఆమాత్రం జాగా కూడా లేదు. ఆవిడ తినడానికి, త్రాగడానికి ఏమన్నా తయారు చేయమని నా శ్రీమతికి పురమాయించాను. ఆవిడ ఉదయం నుంచి ఆ విషయమై వంటింట్లో కుస్తీ పడుతోంది.

నేను తుడిచిన కుర్చీలు, తలుపులు మరల మరల తుడిచి వీలైనంత వరకూ ఇంటిని శుభ్రంగా ఉంచడానికి అలా పనిలో మునిగి నా టెన్షన్ తగ్గించుకోడానికి ప్రయత్నిస్తున్నాను.

అసలు మేడమ్ మా ఇంటికి రావడానికి కారణం... నా మనస్సు మెల్లగా పదిహేను రోజుల వెనక్కి ప్రయాణించింది.

ఆరోజు ఉదయం ఆఫీసులో నా కుర్చీలో కూచున్నానో లేదో మేనేజింగ్ డైరెక్టరుగారి నుండి




పిలుపు వచ్చింది. ఇంత చిన్న ఉద్యోగిని అయిన నన్ను ఆయన పిలవడమంటే ఏదో పెద్ద విశేషమే ఉండి ఉంటుంది. నేనేమీ తప్పు చేయలేదు కదా. నా మనస్సు కీడును శంకించింది. నేను కంగారుగా అడుగులో అడుగు వేసుకుంటూ మేనేజింగ్ డైరెక్టరు గారి రూముకు వెళ్ళాను.

వణుకుతున్న చేతులు, కంఠంతో నమస్కారం చేశాను. ఆయన విషయాన్ని చాలా సూక్ష్మంగా, సూటిగా చెప్పారు. తన భార్య తనదేశం నుండి ఇండియా వస్తోందనీ, ఆమె దేశమంతా తిరిగి రావాలనుకుంటోందనీ, కానీ అనుకోకుండా తగిలిన ఒక ముఖ్యమైన బిజినెస్ పనిమీద తాను వరుసగా వారం పదిరోజులు వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులను కలుసుకోవాలనీ, వారితో ఎన్నో విషయాలు చర్చించాలని చెప్పారు. అందుచేత తన శ్రీమతితో నేను వెళ్ళి దేశంలో వివిధ ప్రాంతాలు చూపించాలని చెప్పారు. నేను తటపటాయించాను. అది ఆయన గ్రహించినట్లున్నారు. తమ దేశంలో కుల, మత, స్త్రీ పురుష బేధాలు లేవనీ అలాగే పెద్ద చిన్న అంతరాలు లేవని, మంచీ, చెడూ రెండే ఉంటాయని, నేను మంచివాడిని నెమ్మదస్తుడిని కనుక ఈ పనిని నాకు అప్పచెపుతున్నానని చెప్పారు.

ఆయన ఇంకొక విషయం చెప్పారు. తన భార్య చిన్నప్పటినుంచీ తెలుగుభాషపై మక్కువతో తెలుగు నేర్చుకుందనీ కనుక భాష కూడా సమస్య కాదనీ చెప్పారాయన.

నా సంశయాలు ఇంకా తీరలేదని గ్రహించినట్లున్నారాయన. మేమిద్దరమూ విమానంలోనే ప్రయాణిస్తామని, పెద్ద హోటళ్ళలో రూములు బుక్కు చేయబడ్డాయని అన్ని వివరాలు చెప్పారాయన. ఆవిడకు మాట సహాయం కోసం, మనిషి సహాయం కోసం నన్ను పంపుతున్నానని చెప్పారాయన. రెండు రోజులలో బయలుదేరడానికి సిద్ధంగా ఉండమని చెప్పి తన పనిలో నిమగ్నమైపోయారు. నాకు మాట్లాడే అవకాశం కానీ, ఆలోచించుకునే వ్యవధి కానీ ఇవ్వలేదు. నేను తిరిగి నా సీటు వైపు నడుచు కుంటూ ఆలోచించసాగాను. నేను ఇదివరకూ రెండు, మూడు సందర్భాలలో, మా డిపార్టుమెంటు హెడ్ ఇచ్చిన పనిని, ఆయన అంచనాకు మించి త్వరగా, చక్కగా చేసాను. అలాగే ఒకసారి కంపెనీకి ఆర్థికంగా బాగా లాభించే ఉపాయం చెప్పాను. మరొకసారి బోర్డు మీటింగ్‌లో కొన్ని విషయాలు చర్చించడానికి నోట్స్ తయారుచేయవలసి వచ్చింది. అందరూ అప్పుడు నన్ను మెచ్చుకున్నారు. అప్పుడే నేను మా మేనేజింగ్ డైరెక్టరు దృష్టిలో పడడం జరిగింది. ఆ తరువాత కూడా నా గురించి మంచి రిపోర్ట్స్ పైకి వెళ్ళడం జరిగింది. బహుశా అవన్నీ గమనించేనేమో మా మేనేజింగ్ డైరెక్టరుగారు నాకు ఈ గురుతరమైన బాధ్యత అప్పగించడం జరిగింది.

నాకు కంగారు ఎక్కువ అయింది. మేనేజింగ్ డైరెక్టరుగారి భార్యతో ప్రయాణం. అదీ విమానంలో. నేను హైదరాబాద్‌లో ఉంటున్నా విమానాన్ని ఆకాశంలో వెళుతూంటే చూడడమే తప్ప కనీసం దగ్గరనుంచి కూడా ఎప్పుడూ చూడలేదు. అటువంటిది మేడమ్‌తో విమానంలోనూ, కారులోనూ ప్రయాణం అనేసరికి గుండె దడ పట్టుకుంది.

నాకు అప్పచెప్పిన పని కత్తిమీద సాము లాంటిది. ఏ చిన్నతప్పు జరిగినా ఉద్యోగం పోవడం ఖాయం. బ్రతుకు బజారున పడుతుంది. కానీ చెప్పిన

పని చేయక తప్పదు !!

విషయమంతా నా భార్యకు చెప్పాను. ఆవిడ చాలా సంతోషించింది. అలాంటి అవకాశం నాకు వచ్చినందుకు అభినందించింది. వచ్చిన బంగారం లాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోక, కంగారు పడడమేమిటని సున్నితంగా కోప్పడింది.

నేను భౌతికంగానూ, మానసికంగానూ ప్రయాణానికి సన్నద్ధం కావడం ప్రారంభించాను.

అనుకున్న విధంగానే బయలుదేరడం జరిగింది. అన్ని ప్రదేశాలు చూడడం జరిగింది.

అసలు జీవితంలో దగ్గరనుంచి కూడా చూడని విమానంలో ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో ప్రయాణం, నేలమీద నడిస్తే అరిగిపోతుందేమో మాసిపోతుం దేమో అనే నేల ఉన్న హోటళ్ళలో బస, అత్యంత ఖరీదైన తిండి... నిజం చెప్పాలంటే ఆ టూరంతా ఒక కలలా గడిచిపోయింది. మేడమ్ కూడా నన్ను ఒక తక్కువ స్థాయి గుమాస్తాగా చూడకుండా తన స్వంత తమ్ముడిలా ఆప్యాయంగా మాట్లాడింది. నన్ను పేరు పెట్టి పిలవకుండా "తమ్ముడూ" అని స్వచ్ఛమైన తెలుగులో సంభోదించేది. అది ఆవిడ మహోన్నత వ్యక్తిత్వానికి తార్కాణం గానీ నా గొప్ప తనమేమీ కాదని నాకు తెలుసు. ఆవిడ మనదేశంలో వివిధమైన వింతలు, విశేషాలు చూసి చాలా సంతోషించింది. ఎన్నో వందల ఫోటోలు, అనేక సిడిలు తీసుకుంది. మొత్తానికి ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా, అనుకున్న ప్రకారం టూరు ముగిసింది. మా మేనేజింగ్ డైరెక్టర్ చాలా సంతోషించారు. ఆయన నాకు ధన్యవాదాలు తెలిపి ప్రశంసించారు. నాకు జీవితం ధన్యమైందనిపించింది.

మేడమ్ ఒకరోజు మా ఇంటికి వస్తానని చెప్పింది. మళ్ళీ కంగారు పడడం నా వంత యింది...

సెల్‌ఫోన్ మ్రోగడంతో నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. అది మేడమ్ నాకు కొనిచ్చిన సెల్‌ఫోను.

"తమ్ముడూ ఇది నా జ్ఞాపకార్థంగా నీకు ఇస్తున్నాను" అని ఇచ్చిందావిడ. నేను "వద్దు" అని చెప్పే అవకాశం ఇవ్వలేదు.

మేడమ్ మా ఇంటికి బయలుదేరుతున్నా రనేది ఆ ఫోన్ సారాంశం. ఆవిడకు గుమ్మంలో నేను, నా శ్రీమతి స్వాగతం పలికాం.

"అతను తమ్ముడు. నువ్వు మరదలివి" అంటూ చీరె, జాకెట్టు నా శ్రీమతికి ఇచ్చింది. నాకు పాంటు, షర్టు పిల్లలకు బట్టలు, బొమ్మలు తెచ్చింది. నేను ఉంటున్న ఇల్లంతా కలయ చూసిందావిడ. మా ఇద్దరినీ పిల్లలను నిశితంగా పరిశీలించింది. మొత్తానికి అరగంటసేపు మా ఇంట్లో గడిపింది ఆవిడ.

మా ఆవిడ కష్టపడిచేసిన ఉప్మా పెసరట్టు అల్లప్పచ్చడితో అందించింది. ఆవిడ చాలా ఇష్టంగా తిన్నట్లనిపించింది.

"చాలా బావుందమ్మా నువ్వు ఇచ్చిన టిఫిను" అంటూ నా శ్రీమతిని మెచ్చుకుంది. తరువాత పాయసం తీసుకుందావిడ.

"ఈ దేశమంతా తిరిగాను. ఎన్నో సుందర మైన, అందమైన దృశ్యాలను చూసాను. అలాగే చాలామంది ఇళ్లకు వెళ్లడం తటస్థించింది. ఎక్కడా చూడనిది, లేనిది ఒకటి మీ ఇంట్లో చూశాను" అంది మేడమ్ నవ్వుతూ.

"ఆవిడ మన పేదరికాన్ని అవహేళన చేయడం లేదుకదా" అన్నట్లు శ్రీమతి నా వైపు చూసింది.

'ఛ ! ఛ ! ఆవిడ చాలా ఉత్తమురాలు. అలాంటిదికాదు' నేను చూపులతోనే సమాధానం చెప్పాను.

మూతి బిగపట్టి భుజాలెగరేసింది నా శ్రీమతి.

నేను వస్తున్న నవ్వును బలవంతాన ఆపు కున్నాను.

"తమ్ముడూ మీ ఇంట్లో ఒక అద్భుతం చూసాను ! అదేమిటో తెలుసా ! భారతీయత. ముఖ్యంగా తెలుగుతనం ఉట్టిపడే మీ ఇల్లు. చక్కటి విషయమేమిటంటే మీ పిల్లలు అందరి పిల్లల్లా టీ.వి ముందు కూర్చొని కాలక్షేపం చెయ్యకుండా బుద్ధిగా చదువుకుంటూ కూర్చోవడం. నన్ను ముగ్ధురాలిని చేసిన విషయమేమిటంటే మీ ఇద్దరినీ మీ పిల్లలు ప్రేమగా, మనసారా అమ్మా నాన్నా అని స్వచ్ఛమైన తెలుగులో పిలవడం. ఈ దేశంలో ఎందరో పిల్లల్ని చూసాను. అందరూ మమ్మీ, డాడీ అనే వాళ్ళే గాని, మాతృభాషలో ప్రేమగా పిలిచే వాళ్ళని చూడలేదు. మీ పిల్లల పిలుపులు నా చెవులకు తీయగా సోకాయి. ఇక మీ కుటుంబంలోని ప్రేమానురాగాలు ఒకరంటే ఒకరికి ఎంతటి ఆప్యాయం, అంతఃకరణలు ఉన్నాయో ఈ కొద్ది సేపటిలోనే గ్రహించాను... నేను విన్న చదువుకున్న భారతీయత మీ ఇంట్లో సంపూర్ణంగా చూశాను. ఇంతవరకూ దేశంలో వివిధమైన వింతలు, విశేషాలు చూడడం ఒక ఎత్తు.. మీ ఇంటికి రావడం అమృత ప్రాయమైన ఆప్యాయమైన ఈ వాతా వరణం... ఈ ప్రేమాభిమానాలు, ఈ పిలుపులూ..... తమ్ముడూ మీ ఇంటికి రావడం, కొంతసేపు మీతో గడపడం ఒక ఎత్తు.... నిజంగా మీ కుటుంబంతో కొంతసేపు గడపడం ఒక మధురానుభూతిని కలి గించింది..... అది జీవితాంతం నాకు తియ్యని జ్ఞాపకంగా మిగిలిపోతుంది" అంది మేడమ్ ఇంటి లోంచి బయటకు నడుస్తూ....



శ్రీ త్యాగరాయ గానసభ హైదరాబాదులో కవి సమయం, మానస - సంయుక్తంగా నిర్వహించిన అద్దేపల్లి సప్తతి పూర్తి ముగింపు ఉత్సవ సభలో ఆయనను సత్కరిస్తున్న సి.నారాయణరెడ్డి. చిత్రంలో రఘుశ్రీ, సోమయాజులు, నోముల సత్యనారాయణ, ద్వానాశాస్త్రి, తాళ్ళపల్లి మురళీధరగౌడు, కళా వేంకటదీక్షితులు.